క్లుప్తంగా

ఓటు నమోదుకు నేటితో ఆఖరు

ప్రత్తిపాడు: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగియనుందని ప్రత్తిపాడు తహసీల్దార్ జి.కరుణకుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత పత్రాలను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి నకలు కాపీని కార్యాలయానికి అందించాలని కోరారు. అదేవిధంగా ఆధార్, ఓటు గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. కచ్చితంగా ఆన్‌లైన్ చేయాలని లేదని, మాన్యువల్‌గా దరఖాస్తులను తమ కార్యాలయంలో గానీ, లేదా నేరుగా తనకు గానీ అందించాలని కరుణ కుమార్ కోరారు. పట్టభద్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెహ్రూ నగర్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు దరఖాస్తు చేయడానికి గడువు బుధవారంతో ముగుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1, 2021 నాటికి ముందు పట్టభద్రులైన వారు ఆన్‌లైన్‌లో, గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్‌గా అర్హత కలిగిన వారు తమ ఓటు కోసం దరఖాస్తు చేయడానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు బుధవారం వరకే అవకాశం ఉందన్నారు.

నైపుణ్య గణన పకడ్బందీగా చేయాలి



గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్యగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా 15-59 సంవత్సరాల వయస్సుగల వారికి నైపుణ్య గణన సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో స్కిల్ సెన్సస్ మండల కోఆర్డినేటర్ సాయికుమార్, విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ ఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచడమే లక్ష్యం



పొన్నూరు: భవిష్యత్‌లో ప్రతి ఒక్కరిలో నైపుణ్యాతను పెంచేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి 15 నుంచి 59 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి డేటాను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పీఎస్ఎస్‌డీసీ స్కిల్ సెన్సెస్‌పై సచివాలయ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్కిల్ సెన్సెస్ ట్రెనింగ్ కో ఆర్డినేటర్ మణికంఠ గోపాల్ పాల్గొని కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిపల్ అలపర్తి చంద్రమోహన్, లక్ష్మీనారాయణ చౌదరి, అహ్మద్ ఖాన్, ఆర్వో, హౌసింగ్ డీఈ, సీఎంఎం హనుమానాయక్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మెన్ మృతి

చేబ్రోలు: గుర్తు తెలియని వాహనం ఢీ కొని విద్యుత్ లైన్‌మెన్ మృతి చెందిన ఘటన నారాకోడూరు గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(27) గుండవరంలో విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. 2వ తేదీన రాత్రి పది గంటల సమయంలో బైక్‌పై నారాకోడూరు బయలుదేరాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని టాటా ఏస్ వాహనం రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో ఉన్న మస్తాన్‌వలిని వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మస్తాన్‌వలి మంగళవారం మృతిచెందాడు. జరిగిన ఘటనపై స్థానిక ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలపై వినతి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు మంగళవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణను కలసి సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు త్వరగా క్లియర్ చేయాలని కోరారు. ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీం ద్వారా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య చికిత్స అందేలా చూడాలన్నారు. సూపరింటెండెంట్‌ను కలసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షుడు రహిమాన్, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, నాగరాజు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సర్కారీ వాహనాలకు.. నిర్లక్ష్యపు తుప్పు





మూలకు చేరిన ట్రాక్టర్లు, జీపులు, చెత్త వాహనాలు, డస్ట్ బిన్‌లు

- పదుల సంఖ్యలో మూలకు చేరిన వాహనాలు
- పట్టించుకోని అధికారుల తీరుపై విమర్శలు

పొన్నూరు: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సేవలు అందించడంతో పాటు ఆదాయాన్ని తెచ్చిపెట్టే వనరులు అనేకం ఉన్నా సంబంధిత విభాగాల అధికారుల నిర్లక్ష్యం వలన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ముఖ్యంగా మూలకు చేరిన ప్రభుత్వ వాహనాలను ఏళ్ల తరబడి అలాగే వదిలేయడంతో తుప్పు పట్టి పోయి కనీసం స్క్రాప్‌కు కూడా అమ్మేందుకు పనికి రాకుండాపోతున్నాయి. తమ సొంత వాహనాలు పాడైతే మరమ్మతులు చేయడమో.. అమ్మేయడం వంటివి చేస్తారు కానీ ప్రభుత్వానికి సంబంధించిన వాహనాలు కాబట్టి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై పట్టణ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లెక్కల్లో లేనివి ఎన్నో..

తుప్పుపట్టిపోయినా..

నిడుబ్రోలు ప్రజారోగ్య విభాగంలో పదుల సంఖ్యలో చెత్త సేకరణ వాహనాలు మూలకు చేరాయి. ఇలా పట్టణంలోని చాలా చోట్ల డస్ట్‌బిన్లు పగుళ్లిచ్చి వినియోగానికి నోచుకోక వృథాగా ఉన్నాయి. వాస్తవానికి ఏటా మూలకు చేరిన వాహనాలను వేలం వేసి విక్రయించాలి. ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యం కారణంగా పొన్నూరు మున్సిపాలిటీలో మాత్రం అలాంటిదేమీ జరగడం లేదు. దీంతో పూర్తిగా తుప్పుపట్టి పాడైపోయి స్క్రాప్‌కు అమ్మితే చిల్లిగవ్వ వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. మూలకు చేరిన వాహనాలను అమ్మకుండా వదిలేయడంతో వాహనాల్లో పాములు, పందులు, కుక్కలు తమ ఆవాసాలుగా చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

డస్ట్ బిన్‌లు కొత్తవి ఏర్పాటు చేస్తాం



మున్సిపాలిటీ పరిధిలో ఉన్న స్క్రాప్ వాహనాలు, డస్ట్ బిన్‌లను విక్రయిస్తాం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాడైన డస్ట్ బిన్‌లను స్క్రాప్‌గా చేసి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తాం. వినియోగానికి వచ్చే వాటికి మరమ్మత్తులు చేయిస్తాం. పాడైపోయిన వాటిని గుర్తించాలని ఇప్పటికే ఇంజినీర్లను కోరాం.

–శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొన్నూరు

వారంలో రెండు రోజులు వ్యాక్సినేషన్

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

ప్రత్తిపాడు: ప్రతి వారం బుధ, శనివారాల్లో తప్పని సరిగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువుల ఆధారంగా గ్రోత్ చార్ట్ సిద్ధం చేసుకోవాలి, పెరుగుదల పట్టికలో ఏమైనా రెండ్ అలర్ట్ ఉంటే వెంటనే వైద్యాధికారులకు తెలియజేయాలని చెప్పారు. గర్భిణులు పుట్టింటికి వెళ్లినప్పటికీ, ప్రసవించే వరకు ఏఎన్ఎంలు ఫాలోఅప్ చేయాలని కోరారు. అదే విధంగా బిజిటీ టీకాను వేగవంతం చేయాలని కోరారు. సచివాలయ ఏఎన్ఎంలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు సమయాన్ని మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పురుషులు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మేరి యునిస్, హేమంత్, ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



పెదకాకాని: మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జాకబ్‌రాజు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మండలంలోని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాకబ్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారని, తద్వారా చిన్న వయస్సులోనే జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రకమైన సమస్యలకు సైకియాట్రిస్ట్, సైకాలజిస్టుల అనుభవం కలిగిన నిపుణులతో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎస్.రామాంజిరెడ్డి, ఎంపీహెచ్ఈఓ జి.శ్రీనివాసరావు, ఎం.భవాని, టి.మాణిక్యమ్మ, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్స్ బి.రమేష్ పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న గుంటూరు నగర కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. రోజువారీ పర్యటనలో భాగంగా నగర శివారు విలీన గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై కేటాయించిన విధుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరిచిన ఏఈ నాగవేణిని విధుల నుంచి సస్పెండ్ చేసి ఈఎన్సీకి సిఫార్స్ చేయాలని ఎస్ఈకి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు బొంతపాడు (194 వార్డు సచివాలయం) శానిటేషన్ కార్యదర్శి బి.బోడెయ్యను విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. కేవీపీ కాలనీ, అంకిరెడ్డిపాలెం, చౌడవరం, బుడంపాడు, బొంతపాడు ప్రాంతాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక వసతుల ఏర్పాటు, సంజీవయ్య నగర్ గేటు దగ్గర తాగునీటి ప్రధాన పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్, లీకులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ కేవీపీ కాలనీ కేఎస్ఆర్టీ హైస్కూల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు, నీటి సౌకర్య కల్పనపై నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈ నాగవేణిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఎన్సీకి సిఫార్స్ చేయాలని ఎస్ఈని ఆదేశించారు. అంకిరెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని, కేంద్రం పక్కనే స్థానికులకు అనువుగా లైబ్రరీ నిర్మాణానికి, ఎస్సీ కాలనీ శ్మశానానికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. అలాగే చౌడవరం, బుడంపాడు, బొంతపాడు ప్రాంతాల్లోని కేంద్రాల్లో కూడా పనులను ఈ నెల 15 నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బొంతపాడు 194 వార్డు సచివాలయం పరిధిలో శానిటేషన్ కార్యదర్శి బోడెయ్య ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉంటున్నారని, స్థానికుల ఫిర్యాదు మేరకు విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. శివనాగరాజు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, ప్రతి రోజు వస్తున్న అవుట్ పేషెంట్ వివరాలను రిజిస్టర్‌లో తనిఖీ చేసి, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో అందించే సేవలగురించి వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా స్థానిక ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. అనంతరం సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర పైప్ లైన్ లీకు, సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించి, తాగునీటి సరఫరా పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఇంటర్ కనెక్షన్ పనుల జాప్యంపై ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, స్థానిక చర్చి పెద్దలతో చర్చించి, వారు అంగీకరించినందున చర్చి పక్కగా పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తి అయితే లీకుల సమస్య తీరడంతో పాటు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సమగ్రంగా నీటిని అందించడానికి వీలు కలుగుతుందని, పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈలు సతీష్, కళ్యాణరావు పాల్గొన్నారు.

పంట మార్పిడి విధానాన్ని పాటించాలి



కొమ్మూరులో జిప్సం ఉపయోగాల గురించి రైతులకు వివరిస్తున్న ఏడీఏ సునీత



ప్రత్తిపాడులో బ్రౌన్ కాటన్‌ను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ గంగాదేవి

కొమ్మూరు(కాకుమాను): ప్రతి ఏటా రైతులు ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించి నేల తల్లిని కాపాడుకోవాలని ఏడీఏ సునీత అన్నారు. మండలంలోని కొమ్మూరు, కాకుమాను గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్సీ ఏడీఏ మాట్లాడుతూ ఏటా రైతులు ఒకే రకం సాగు చేయడంతో పాటు అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో రసాయనిక ఎరువులను విచ్చల విడిగా వాడుతున్నారని ఆమె తెలిపారు. దీని వలన దిగుబడులు తగ్గడంతో పాటు పచ్చని పంట పొలాలు చౌడు భూములుగా మారే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అలవాటు చేసుకుని సాగుకు ముందు పొలంలో జిప్సాన్ని వేయాలన్నారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, లాంఫాం శాస్త్రవేత్త కామాక్షి, ఏఓ కె.కిరణ్మయిపాల్గొన్నారు.

పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడులో: మండలంలోని కొప్పర్రు, అన్నపర్రు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ తిరుమలాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటపై అక్కడక్కడ రసం పీల్చు పురుగు, గులాబీ రంగు పురుగు ఆశిస్తుందని చెప్పారు. దీని నివారణకు పసుపు రంగు జిగురు పూసిన అట్టలను పొలంలో అమర్చుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో శనగ సాగు చేసే రైతులకు సబ్సిడీపై ఎర్ర, తెల్ల శనగలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ బి.సుధారాణి, పశు వైద్యాధికారి స్వాతి, నవీన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పూత దశలో ఉన్న వరికి జాగ్రత్తలు పాటించాలి

పొన్నూరు: వరి పొలాలు వెన్ను బయటకు వచ్చి పూత దశలో ఉన్నాయని ఈ సమయంలో అగ్గి తెగులు నివారణకు సంబంధించిన ట్రై సైక్లో జోన్ 75% ఎస్పీ120 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలని మండల ఏఓ డేగల వెంకట్రామయ్య అన్నారు. మంగళవారం నిడుబ్రోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పిచికారి సమయం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 లోగా ఉండే విధంగా చేయాలన్నారు. దీనిద్వారా పూత సమయంలో పిచికారి వలన కలిగే నష్టాలు నివారింపబడతాయని తెలిపారు. పూత సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే ఉంటుందని, ఏ మందు అయినా పిచికారీ చేయాలనుకుంటే రెండు గంటల తరువాత చేయాలని సూచించారు. రైతులు తైవాన్ స్ప్రేయర్లు ఇవ్వాలని కోరడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్ప్రేయర్లు అందించే విధంగా చేస్తామని తెలిపారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

ప్రత్తిపాడు: సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.అరుణకుమారి తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక ప్రత్తిపాడు- పాతమల్లాయపాలెం రోడ్డులో రైతులు సాగు చేసిన బ్రౌన్ కాటన్‌ను పొలాన్ని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.గంగాదేవి, ఏఓతో కలిసి పరిశీలించారు. సాగు చేసిన రైతులతో మాట్లాడారు. బ్రౌన్ కాటన్ సాగు వలన ఎలాంటి ఉపయోగం కనిపించడం లేదని రైతులు వాపోయారు. బ్రౌన్ కాటన్ సాగుకు అర ఎకరానికి అయ్యే ఖర్చుతో తెల్ల పత్తి పంటను ఎకరా సాగు చేయవచ్చని తెలిపారు. అంతేకాకుండా తెగుళ్లు, పురుగు ఉధృతి కూడా అధికంగా ఉంటుందని, ఈ ప్రాంతానికి ఈ బ్రౌన్ రకం పత్తి సానుకూలంగా ఉండదని శాస్త్రవేత్తలకు వివరించారు. అనంతరం రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏఓ అరుణ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా పత్తి ఉంటే క్వింటా రూ. 7,521 కు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కోయవారిపాలెంలో సాయిట్రేడర్స్ నందు సీసీఐ కేంద్రాన్ని ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ సెంటర్ ఏవో రాజవంశి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



వెంకటరమణ(ఫైల్)

పెదకాకాని: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. సీఐ టి.నారాయణస్వామి అందించిన వివరాలు.. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన తాళ్లూరి సుబ్బారావు, వెంకటరమణ భార్యాభర్తలు. వెంకటరమణ గత నెల 21వ తేదీ తెల్లవారు జామున వెళ్లిపోయింది. ఇంత వరకు ఆమె ఆచూకి లభ్యం కాలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అర్ధాకలేనంట..!

చాలీచాలని మధ్యాహ్నం వంట..



ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని పాఠశాలలో భోజనం చేస్తున్న కొందరు విద్యార్థినులు

ప్రత్తిపాడు: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చాలీచాలని వంటతో విద్యార్థులను అర్ధాకలికి పరిమితం చేస్తున్నారు. అందుకు సాక్ష్యమే ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కనిపించిన ఈ చిత్రాలు. మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులకు మెనూ ప్రకారం పులిహోర, దొండకాయ చట్నీతో పాటు కోడిగుడ్డును అందించాల్సి ఉంది. అయితే పులిహోర కాస్త అటుఇటుగా ఉన్నప్పటికీ చట్నీ సరిపడినంత లేకపోవడంతో విద్యార్థులు ఉన్నదాంతోనే సర్దుకోవాల్సి వచ్చింది. గిన్నె పూర్తిగా అడుగంటడంతో లోపల గదిలో నుండి చిన్న గ్లాసులో చట్నీ తెచ్చి నిర్వాహకులు సర్దుబాటు చేశారు. అయితే మధ్యాహ్న భోజనం అమలును పర్యవేక్షించాల్సిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పర్యవేక్షణను గాలికొదిలేయడంతో చాలీచాలని భోజనమే విద్యార్థులకు దిక్కయ్యింది. కాగా పాఠశాలలో సగం మందికి పైగా విద్యార్థులు బడిలో మధ్యాహ్న భోజనం చెయ్యకుండా ఇంటి నుండి బాక్సులు తెచ్చుకుని తింటున్నారు.

స్కిల్ సెన్సస్‌పై చేబ్రోలులో శిక్షణ నేడు

చేబ్రోలు: ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వే -2024పై చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత మంగళవారం తెలిపారు. ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాల్సి ఉన్నందున సదురు సర్వే త్వరితగతిన పూర్తి చేయటం కోసం చేబ్రోలు మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని సిబ్బందికి రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు గొడవర్రు, మంచాల, శలపాడు, సుద్దపల్లి, శ్రీరంగపురం, వడ్లమూడి, వేజండ్ల సచివాలయ సిబ్బందికి, మధ్యాహ్నం రెండు గంటలకు చేబ్రోలు, నారాకోడూరు, శేకూరు గ్రామాల సచివాలయ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



ప్రత్యేక అలంకరణలో నాగేంద్రస్వామి



కట్టెంపూడిలో బారులు తీరిన భక్తులు



వడ్లమూడి నాగేంద్రస్వామి దేవస్థానం పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

పొన్నూరు: మండల పరిధిలోని కట్టెంపూడి శివారు శ్రీ నాగేంద్రస్వామి దేవస్థానం(పుట్ట)లో మంగళవారం నాగుల చవితి ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన చవితి వేడుకలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విరాళాల ద్వారా రూ.86.109, హుండీ ద్వారా సుమారు రూ.14 వేల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ నిడమానూరి శ్రీనివాస్ తెలిపారు.

చేబ్రోలులో..

చేబ్రోలు: మండలంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి నాగేంద్రస్వామి దేవస్థానం పుట్ట వద్ద, చేబ్రోలు నాగేశ్వరస్వామి దేవస్థానం పుట్ట, శలపాడు, మంచాల, శేకూరు, గొడవర్రు తదితర గ్రామాల్లో నాగుల చవితి పండుగ సందర్భంగా భక్తులు ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్లమూడి నాగేంద్రస్వామి పుట్ట వద్దకు తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వడ్లమూడి, తెనాలి, చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి భక్తులు పుట్టలో పాలు పోసేందుకు తరలి వచ్చారు. తెనాలి రోడ్డులో రెండు కి.మీ. పొడవున భక్తులు బారులు తీరారు.

భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామికి పూజలు

పెదకాకాని: నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన పెదకాకాని గొడపాలెంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద తెల్లవారు జామునుండే భక్తులు బారులు దీరారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఎన్‌సీసీ విద్యార్థులకు బీ సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్‌లు పొందిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: దేశ రక్షణలో, సామాజిక సేవలో పురుషులతో సమానంగా మహిళా ఎన్‌సీసీ క్యాడెట్స్ చురుకైన పాత్ర దేశభక్తికి సూచిక అని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో 10వ ఆంధ్రా బాలికల బెటాలియన్ ద్వారా ఇటీవల జరిగిన ఎన్‌సీసీ బాలికల విభాగ సర్టిఫికెట్ బీ పరీక్షల్లో ఉత్తీర్ణతలై మంచి ఫలితాలు సాధించిన 16 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, హవాల్దార్ ఆసిఫ్ సైద్, ఎన్‌సిసి బాలికల విభాగ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఉష క్రాంతి అభినందించారు.

చిప్స్ కళాశాలలో ఎనలైటికా వర్క్ షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని చిప్స్ కళాశాలలో ఎనలైటిక వర్క్ షాప్ నిర్వహించినట్లు చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీలో ఉన్నటువంటి ఎనలైటికల్ ఇన్‌స్ట్రూమెంట్స్ గురించి వర్క్‌షాపు నిర్వహించడం జరిగిందని చెప్పారు. జేకేసీ కళాశాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

వేలం ప్రకటన

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION):: GUNTUR
E.P.No.140 / 2023 IN O.S.No. 409 / 2017

Between:
Paladugu Srinivas ...D.Hr
And
Peram Radha Krishna Murthy (Died) & 2 Others ...J.Drs

Schedule: Guntur Dt., Duggirala Sub-Dt., Tangellamudi Gram Panchayat area, Tangellamudi(V), D.No. 108/A-1B, an extent of Ac.7-56 cents, out of it an extent of Ac.0-50 cents is being bounded by **East:** Bode Canal, **South:** Land belongs to Vaka Venkateswarlu, **West:** Land belongs to Peram Radhakrishna Murthy, **North:** Bode Canal belongs to Government Within these boundaries an exten. of Ac.0-50 cents or 2023.43 Sq.Mts. of Wetland.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

డి.హెచ్.ఆర్ విలువ సుమారు 1 యకరానికి రూ.15,00,000/-

అప్‌సెట్ విలువ రూ.8,00,000/-

వేలం కాయిదా ది.26-11-2024

ఫర్దర్ హియరింగ్ ది.03-12-2024.

నోట్: పెద్యులు అస్తి ది.16-06-2016న డి.హెచ్.ఆర్.కు రిజిస్టర్ తనఖాచేసియున్నారు

I. SRINIVASA RAO
Advocate for DHR, Guntur. Cell: 9441692365